మున్సిపాలిటీలకు ఉద్యోగులేరీ ?

- నూతన మున్సిపాలిటీల్లో పంచాయతీ కార్యదర్శులే అధికారులు
- ఇన్‌చార్జ్‌ల పాలనలోనే ఎల్లంపేట్, అలియాబాద్, మూడు చింతలపల్లి



మూడు చింతలపల్లి మున్సిపల్ కార్యాలయం

మేడ్చల్: గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చి, నూతన మున్సిపాలిటీలను ఏర్పాటు చేసినా.. పూర్తి స్థాయిలో అధికారులు, ఉద్యోగులను నియమించక పోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు.

◆ మేడ్చల్ నియోజకవర్గంలో నెల రోజుల క్రితం వరకు 7 మున్సిపాలిటీలు, 61 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రభుత్వం కొన్ని గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసి, మిగతా గ్రామాలను 3 నూతన మున్సిపాలిటీలుగా మార్చింది. మేడ్చల్ మండలంలో రూరల్ గ్రామాలన్నింటినీ కలిపి ఎల్లంపేట్ మున్సిపాలిటీగా శామీర్‌పేట్ మండలంలో తూంకుంట మున్సిపాలిటీలో మిగిలిన గ్రామాలను అలియాబాద్ మున్సిపాలిటీ, మూడు చింతలపల్లి మండలాన్ని మూడు చింతలపల్లి మున్సిపాలిటీగా మార్చి నెల రోజుల క్రితం గెజిట్ విడుదల చేసి 3 మున్సిపాలిటీలను ఏర్పాటు చేసింది.

పంచాయతీ ఉద్యోగులే మున్సిపల్ ఉద్యోగులుగా..

గతంలో గ్రామ పంచాయతీల్లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు ప్రస్తుతం మున్సిపల్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం ఎలాంటి ఆప్షన్ ఇంత వరకు ఇవ్వకపోవడంతో బిల్ కలెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్‌లు పంచాయతీరాజ్ విభాగంలోని మండల పరిషత్ కింద ఉంటూ.. మున్సిపల్ వ్యవస్థలో పనిచేస్తున్నారు. వేతనాలు మండల పరిషత్‌ల ద్వారా తీసుకుంటూ విధులు మున్సిపాలిటీల్లో నిర్వహిస్తున్నారు.

శాశ్వత ఉద్యోగులు లేకపోవడంతో ఇబ్బంది..

నూతన మున్సిపాలిటీల్లో 10 వరకు గ్రామాలు ఉండటంతో సీనియర్ పంచాయతీ కార్యదర్శులను మున్సిపల్ మేనేజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చి తాత్కాలికంగా మున్సిపల్ బండి లాగుతున్నారు. శాశ్వత ఉద్యోగులు లేకపోవడం, ఎవరికి ఏ పోస్టు ఎన్ని రోజులు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో ఉద్యోగుల విధి నిర్వహణలో అంకితభావం కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బదిలీలపై స్పష్టత కరువు..

ప్రభుత్వం ఉద్యోగుల బదిలీ, శాఖల మార్పుపై స్పష్టత ఇవ్వకపోవడంతో చేసేపనిలో స్పష్టత కరువైంది. అసలే నూతన వ్యవస్థ, కొత్త మున్సిపాలిటీల్లో ఇప్పటి వరకు అన్ని గ్రామాలు, గ్రామీణ వ్యవస్థ, మున్సిపల్‌కు గ్రామపంచాయతీల పాలనకు తేడా అధికంగా ఉండటంతో పనుల కోసం వెళ్లే నూతన మున్సిపల్ ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

కీలకశాఖల్లో ఇన్‌చార్జ్‌లే..

మున్సిపల్‌కు అధిక ఆదాయం తీసుకొచ్చే ప్రధాన పోస్టులు భవనాలకు అనుమతులు ఇచ్చే టీపీఎస్‌లు, అభివృద్ధి పనులు చేపట్టే డీఈ, ఏఈలు, మేనేజర్, రెవెన్యూ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇలాంటి ప్రధాన పోస్టుల్లో ఇన్‌చార్జ్ అధికారులే కొనసాగుతున్నారు.

అవగాహన లేని వారితో అవస్థలు..

గతంలో మున్సిపల్ వ్యవస్థపై ఏ మాత్రం అవగాహన లేని అధికారులు మున్సిపాలిటీలో ఇన్‌చార్జ్ అధికారులుగా కొనసాగుతున్నారు. ఏఈ, డీఈ పోస్టులకు అధికారులు లేకుండా పోయారు. డీఈ, ఏఈ, టీపీఎస్ వంటి కీలకపోస్టుల్లో పంచాయతీ కార్యదర్శులు ద్వితీయ శ్రేణి అధికారులుగా ఉన్నారు. అసలు అధికారి జాడ కనిపించడం లేదు.

పని ఓ చోట.. వేతనం మరో చోట...

మున్సిపాలిటీల ఏర్పాటుపై ఉన్న శ్రద్ధ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులను నియమించడంలో ప్రభుత్వానికి లేకపోవడంతో నూతన మున్సిపాలిటీలో పాలన వ్యవస్థ గందరగోళంగా తయారైంది. పని ఒకరిది పెత్తనం మరోకరిది కావడంతో మున్సిపల్ వ్యవస్థలో పాలన గాడిలో లేనట్లుగా కనిపిస్తుంది.

మేడ్చల్ మున్సిపల్ బీజేపీ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ బీజేపీ నూతన కమిటీ సభ్యులను ఎంపీ ఈటల రాజేందర్ అభినంధించారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్‌లోని ఆయన నివాసంలో నాయకులను ఎంపీ అభినందించారు. నూతన కార్యవర్గం మున్సిపాలిటీ పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని కోరారు. వార్డులలో పర్యటించి ప్రజాసమస్యలపై పోరాటం చేయాలన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయయే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పట్టణ నాయకులు శైలజ, ప్రేమ్‌దాస్ నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు.

‘పీసెట్- 2025’లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


సాయివర్షిత 10 వ ర్యాంకు

ఘట్‌కేసర్: పీసెట్-2025 ఫలితాల్లో అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ భువనగిరి డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో సాయివర్షిత తెలంగాణలో పదో ర్యాంకు, శిరీష 66వ ర్యాంకు, తిష్మ 84వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీ స్వప్న, అధ్యాపకులు వారిని అభినందించారు.

100 రోజుల కార్యాచరణపై పోటీలు



మేడ్చల్: పట్టణాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళిక అమలుపై మున్సిపల్ అధికారులు విద్యార్థులకు వివిధ రకాల పోటీలు జరిగాయి. కిష్టాపూర్‌లోని గురకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, పేయింటింగ్‌లలో పోటీలు నిర్వహించారు. కమిషనర్ నాగిరెడ్డి, ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

జవహర్‌నగర్: పేదల జోలికి వస్తే ఊరుకోబోమని జవహర్‌నగర్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు కమల్ అన్నారు. కాప్రా రెవెన్యూ అధికారులు పేదల ఇళ్లను కూల్చడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం జవహర్‌నగర్ ప్రధాన చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. నాయకులు మహేందర్‌యాదవ్, సంతోషగుప్తా, రాంబాబు, శంకర్, సుజాత, బాబు, అశోక్‌గౌడ్, సన్నీ, యాదగిరి, శ్రావణ్‌కుమార్, రాజశేఖర్, రాహుల్‌సింగ్, రామకృష్ణ, అనిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థులకు ఉచిత విద్య

మల్కాజిగిరి: అర్హులైన ఎస్సీ విద్యార్థులకు ఒకటోతరగతి నుంచి పదోతరగతి వరకు ఉచిత విద్యను అందిస్తామని మల్కాజిగిరిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ మంచాల శ్రీనివాసులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం బెస్ట్ అవలెబుల్ స్కూల్‌గా పాఠశాలను గుర్తించిందన్నారు. దీనిద్వారా సెలెక్ట్ అయిన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామన్నారు. 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు 9030476629.

యువకుడి అదృశ్యం

కుషాయిగూడ: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ, శుభోదయ కాలనీలో నివసించే తడక మహేష్ (31) ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 16న ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం అతడి పెద్దనాన్న బాలరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్


చెక్కును అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లికి చెందిన లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును ఎంపీ ఈటల రాజేందర్ గుండ్లపోచంపల్లి బీజేపీ నాయకులతో కలిసి అందజేశారు. గుండ్లపోచంపల్లికి చెందిన బండారి రమేష్‌కు రూ.30 వేల చెక్కును అందజేశారు. మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్‌ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన కాసోజు సోమాచారికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును బుధవారం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్‌తో కలిసి అందజేశారు. అర్హులైన నిరుపేదలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వినయ్‌కుమార్, నాయకులు దయాకర్‌చారి, యాకచారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో పేదల ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చడాన్ని నిరసిస్తూ కాప్రా తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సభ్యులు తోటపల్లి శంకర్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వీఎస్.బోస్, జిల్లా కార్యదర్శి ఉమామహేష్ హాజరై మాట్లాడుతూ.. కాప్రా మండల రెవెన్యూ అధికారులు తీరు మార్చుకోకుంటే అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. నాయకులు దశరథ్, నర్సింహ, సహదేవ్, జంగయ్య, స్వరూప, లక్ష్మీనారాయణ, రాజేశ్వరి, సత్యం, కవిత, వెంకటేష్, సూర్యం, ఎల్లయ్య, మాధవి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి


నందకుమార్ మృతదేహం

బీబీనగర్: ఈత కొట్టేందుకు చెరువులోకి దిగిన యువకుడు ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో చోటు చేసుకుంది. స్థానిక సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో నివాసం ఉంటున్న వెల్ల నందకుమార్ (23) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా బుధవారం బోడుప్పల్ నుంచి స్నేహితులను యాదగిరిగుట్ట దర్శనానికి తీసుకొచ్చాడు. తిరుగు ప్రయాణంలో బీబీనగర్‌కు రాగానే వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే ఉన్న పెద్ద చెరువులోకి దిగి ఈత కొట్టేందుకు ఆగారు. చెరువులో ఈతకు దిగిన నందకుమార్ నీటిలో మునిగిపోయాడు. చెరువులో నుంచి నందకుమార్ బయటకు రాకపోవడంతో ఆందోళన చెందిన స్నేహితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తల్లి ఇంద్రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

4,291 రైతులకు రూ.2.57 కోట్ల రైతు భరోసా

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి



సాక్షి,సిటీబ్యూరో: తొలకరి ప్రారంభంలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు వేసి వారి ముఖాల్లో తెలంగాణ ప్రభుత్వం సంతోషాన్ని నింపిందని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. రైతు భరోసా పథకం కింద జిల్లాలో 4,291 మంది రైతుల ఖాతాల్లో రూ. 2.57 కోట్లు జమ అయినట్లు పేర్కొన్నారు. విడుతల వారీగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు పడతాయని, ఎలాంటి అందోళన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. పంట సాగు కోసం రైతు భరోసా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడంపై అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు.

పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులైన ప్రజలకు అందించటంలో ఉద్యోగుల పాత్ర కీలకమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. బుధవారం ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ప్రతినిధులు మర్యాపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవి ప్రకాష్, కార్యదర్శి భరత్ కుమార్, కోశాధికారి శేషసాయి గిరికాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట రైతు ధర్నా

కీసర: మేడ్చల్ నియోజకవర్గంలోని కీసర, మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్ మండలాల్లోని వేలాది మంది రైతులకు రైతు భరోసా ఇవ్వలేదని దీనికి నిరసనగా నేడు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు కీసర రైతు ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడ్చల్ నియోజకవర్గంలో ఒక్క మూడుచింతలపల్లి మండల రైతులకు రైతుభరోసా నిధులు విడుదల చేస్తూ.. మిగతా మండలాలకు ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. తమ నియోజకవర్గ రైతులపై ప్రభుత్వం వివక్ష చూపుతుందని అసహనం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. రామిడి సంతోష్‌రెడ్డి, చర్లపల్లి బలవంతరెడ్డి, ముద్దం శివ, మల్లేష్, సుంకరి కృష్ణారెడ్డి, రామిడి ప్రతాప్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మధుయాదవ్, బాల్‌రెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


నందిని

ఘట్‌కేసర్: ఓ మహిళ అదృశ్యమైన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కృష్ణమూర్తి వెనకాల నివసించే నందిని (24) కుటుంబకలహాల కారణంగా ముగ్గురు పిల్లలను వదిలేసి ఈనెల 15న మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వాకబు చేసిఆ ఆచూకి లభించలేదు. భర్త వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి,సిటీబ్యూరో: 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో విస్తృతంగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరీ తెలిపారు. యోగా ప్రయోజనాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత వైద్య అధికారులు, సిబ్బందిని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, జిల్లా ఆయుష్ కార్యక్రమ పర్యవేక్షకులు శ్రీవల్లి, జంగయ్య, శ్రీదేవి, భిక్షపతి, స్వాతి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

మేడ్చల్: విద్యుత్ తీగలు తెగిపడి 2 పాడి గేదెలు మృతి చెందాయి. మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లికి చెందిన సుశీలమ్మ తన గేదెలను మేత కోసం గ్రామ పరిధిలోని మైల్‌స్టోన్ వెంచర్ సమీపంలోకి తీసుకెళ్లగా అక్కడే ఉన్న స్తంభం నుంచి తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. అధికారులు వెంటనే తెగిపడిన తీగలను తొలగించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వేయర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: భూ భారతి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టం తీసుకొచ్చిందని, ఈ ప్రక్రియలో లైసెన్స్ సర్వేయర్లు కీలకపాత్ర వహించాల్సి ఉందని, జిల్లా అదనపు కలెక్టర్ విజేయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణా తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. లైసెన్స్ సర్వేయర్లకు భూమిహద్దులు, రెవెన్యూ చట్టాలు, హక్కులు తదితర అంశాలపై అవగాహన అవసరమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. సర్వేయర్లు భూ భారతి చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ శిక్షణ తరగతులు 45 రోజులపాటు జరుగుతుందని తెలిపారు. సర్వేయర్లు శ్రద్ధగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తహసీల్దార్ యాదగిరిరెడ్డి, డీఐఓ బలరాం పాల్గొన్నారు.

కొంతమందికే రైతు భరోసా !

మేడ్చల్: ప్రభుత్వం రైతులకు సాగుకు ముందే పంట పెట్టుబడి కోసం రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నామని చెబుతున్నా.. అది మేడ్చల్ జిల్లాలో మాత్రం కనిపించడం లేదు. జిల్లాలో 49 వేలమంది రైతులు ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 4,291 మంది రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు తమ అకౌంట్‌లలో జమ కాగా.. 44 ,709 మంది రైతులకు రైతు భరోసా నిధులు అందలేదు. దీంతో రైతులు గత 2 రోజులుగా మండల వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

అర్బన్ జిల్లా కావడంతో..

మేడ్చల్ జిల్లా పూర్తిగా అర్బన్ జిల్లా కావడంతో ఇక్కడి రైతులకు ప్రభుత్వం రైతులకు రైతు భరోసా అందజేయడంలో మొండిచేయి చూపిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత రెండుసార్లు, తాజాగా మెజార్టీ రైతుల అకౌంట్‌లలో డబ్బులు జమకావడం లేదు. జిల్లాలో మూడు చింతలపల్లి మండలం మాత్రమే సంపూర్ణంగా వ్యవసాయంపై అధారపడి ఉన్న రైతులే అధికంగా ఉన్నారు. మిగతా మండలాల్లో రైతులు సాగుపై అధారపడి ఉన్నా.. వ్యవసాయ క్షేత్రాలు, కమర్షియల్ పంటలు, పాలిహౌజ్‌లు, వంటి సాగుచేసే వారు అధికంగా ఉన్నారు. మేడ్చల్ జిల్లాలో పంటలు సాగుచేస్తున్నా.. భూములకు సైతం రైతు భరోసా రావడం లేదు

దశలవారీగా నిధుల మంజూరు

రైతు భరోసా కింద పెట్టుబడి సాయం రైతులందరికీ అందుతుంది. రైతు భరోసా నిధులు దశలవారీగా వస్తాయి. జిల్లాలోని అన్ని మండలాల రైతులకు భరోసా వస్తుంది.

– చంద్రకళ, జిల్లా వ్యవసాయాధికారి

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ


డబీల్‌పూర్‌లో భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని డబీల్‌పూర్‌లో కాంగ్రెస్ నేతలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి, పట్టాలు అందజేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. లబ్ధిదారులు అధికారుల సూచనల మేరకు ఇంటి నిర్మాణం చేయాలన్నారు. జాప్యం లేకుండా బిల్లులు చెల్లించాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించే భాధ్యత తమదని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవరావు, నాయకులు విఘ్నేశ్వర్‌రెడ్డి, శేఖర్, వెంకటేష్, సుధాకర్, సాలం, పంచాయతీ కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుణ్య క్షేత్రాలకు మేడ్చల్ నుంచి ప్రత్యేక బస్సులు


సుధాకర్, మేడ్చల్ డిపో మేనేజర్

మేడ్చల్: మేడ్చల్ పరిసర ప్రయాణికులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు మేడ్చల్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. మేడ్చల్ డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ నుంచి భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేడ్చల్ నుంచి కాళేశ్వరం, రామప్పదేవాలయం, వరంగల్ భద్రకాళి ఆలయం, వేయి స్తంభాల గుడికి వెళ్లేందుకు వీలుగా ఈనెల 27 నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ.1200, చిన్నారులకు రూ.700 టికెట్ ధర నిర్ణయించినట్లు వివరించారు. 27న ఉదయం 5గంటల బస్సు మేడ్చల్ నుంచి బయలుదేరుతుందన్నారు. అసిస్టెంట్ డీఎం రామారావు డిపో అధికారులు పాల్గొన్నారు.

